క్లుప్తంగా

యనమలకుదురులో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తామని ఎనికేపాడు సర్పంచి రాచమళ్ల పూర్ణచంద్రరావు అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి చేయాల్సిన పనులు, పలు సమస్యలపై పాలకవర్గ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోని రామయ్య చెరువును అభివృద్ధి చేసి రజకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీటీసీ సభ్యుడు రాచమళ్ల రత్నకుమారి, వార్డు సభ్యుడు రాచమళ్ల శ్రీనివాసరావు కోరారు. అలాగే గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు మాదు సుబ్బారావు, వార్డు సభ్యులు కుమారి, భాను, వీణ పాల్గొన్నారు.

సివిల్ రంగంలో సాఫ్ట్‌వేర్‌కు ప్రాధాన్యం



పెనమలూరు: సివిల్ రంగంలో సాఫ్ట్‌వేర్‌కు చాలా ప్రాధాన్యం ఏర్పడిందని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు అన్నారు. కాలేజీలో సోమవారం సివిల్ విభాగం ఆధ్వర్యంలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై వారం రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. సివిల్ విభాగంలో భవనాలు, రోడ్ల నిర్మాణానికి సాఫ్ట్‌వేర్ దోహదపడుతుందని చెప్పారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్ మాట్లాడుతూ సాంకేతికత దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సివిల్ విభాగంలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్ ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని వివరించారు. క్యాడ్ నిపుణుడు కె.ప్రసాద్ మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించే వర్క్ షాప్ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యంగా జీవిద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి రోజూ క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తే శారీరక, మానసికంగా ఆరోగ్యంగా జీవించవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీ రావు అన్నారు. నగరంలో ఏర్పాటైన డాక్టర్స్ వాకర్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ వేడుకలు సోమవారం జరిగాయి. సూర్యారావుపేటలోని మానస సైకియాట్రిక్ నర్సింగ్ హోంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ ఎంవీరావు నూతన కమిటీ సభ్యులతో బాధ్యతల స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధుల బారినపడుతున్నామని, ఈ నేపథ్యంలో వాకింగ్‌కు ప్రాధాన్యం పెరిగిందన్నారు. డాక్టర్స్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ అయోధ్య, కార్యదర్శిగా డాక్టర్ జె భువనేశ్వరరావు, డాక్టర్ ఎంవీ సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ సూరే పవన్‌కుమార్, డాక్టర్ మానస కాజ, పి ప్రకాశరావు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మనం చేసే రక్తదానం మరో ఇద్దరికి ప్రాణదానం చేస్తుందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం డాక్టర్స్ డే పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ రక్తదానం చేస్తే కొత్త రక్తకణాలు ఏర్పడటంతో యాక్టివ్‌గా ఉంటారని చెప్పారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జీసీ పద్మదాసు, సెక్రటరీ వి.కిషోర్, పీవైఎన్ రావు కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.యుగంధర్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి నానా తంటాలు

- తెరవెనుక వలంటీర్ల సేవలు
- నడి వీధుల్లో రోడ్లపై పంపిణీ

పెనమలూరు: వలంటీర్లు లేకపోయినా ప్రతి లబ్ధిదారుడి ఇంటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన మండల పరిధిలో తుస్సుమంది. చాలా ప్రాంతాల్లో లబ్ధిదారులను పిలిపించి గుంపులు గుంపులుగా పింఛన్లు పంపిణీ చేశారు. పెనమలూరు మండలంలో పింఛన్ లబ్ధిదారులు 5,777 మంది ఉండగా వారికి రూ. 2.56 కోట్లు, తాడిగడప మున్సిపాలిటీలో 12,773 మంది లబ్ధిదారులు ఉండగా వారికి రూ. 8.77 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు అవసరం మేరకు ఇతర శాఖల సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. దీంతో సోమవారం ఉదయం పింఛన్ల పంపిణీని ఉద్యోగులు ప్రారంభించారు. అయితే లబ్ధిదారుల చిరునామా తెలియకపోవడంతో తెరవెనుక వలంటీర్ల సహకారంతో పింఛన్లు పంపిణీ చేపట్టారు. వలంటీర్ల పుణ్యమా అని మొదటి రోజు పింఛన్లు పంపిణీ చేసి ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఉదయం కొద్దిసేపు సర్వర్ డౌన్ కావడంతో పింఛన్ల పంపిణీకి కొద్ది సమయం అంతరాయం ఏర్పడింది.

రోడ్లపైనే పింఛన్ల పంపిణీ..

కాగా ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లకుండా టీడీపీ నేతల సహకారంతో వారిని ఒక చోటకు పిలిపించి గుంపులు గుంపులుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఇళ్లకు వచ్చి పంపిణీ చేస్తారని ఎదురు చూసిన లబ్ధిదారులకు చేసేది లేక నిరాశే మిగిలింది. గత్యంతరం లేక రోడ్లపైకి వచ్చి పింఛన్ సొమ్ము తీసుకున్నారు. ప్రధానంగా యనమలకుదురు, కానూరు ప్రాంతాల్లో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. టీడీపీ నేతలు నానా హడావుడి చేశారు.



యనమలకుదురులో రోడ్డుపై పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

కలెక్టర్ అడిగితే ఇంటి వద్దే పింఛన్ ఇచ్చారని చెప్పండి..

కాగా యనమలకుదురు సచివాలయం-2 పరిధి బీసీ కాలనీలో పింఛన్ రోడ్ల పైనే పంపిణీ చేశారు. పింఛన్ పంపిణీ చేసిన సదరు ఉద్యోగి లబ్ధిదారులను ఉద్దేశించి కలెక్టర్ ఆఫీసు నుంచి ఫోన్ వస్తే పింఛన్ ఇంటికి వచ్చి ఇచ్చారని చెప్పండని అన్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇంత బహిరంగంగా పింఛన్లు నడి వీధుల్లో పంపిణీ చేసినా అధికారులు ఎవ్వరు స్పందించకపోవడం విశేషం.

ప్రహసనంగా పింఛన్ల పంపిణీ

కంకిపాడు: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రహసనంగా సాగింది. ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. అయితే సచివాలయ సిబ్బంది కొందరు ఇంటింటికీ వెళ్లకుండా తమకు కేటాయించిన ప్రాంతంలో ఒక చోటకు వెళ్లి అక్కడి వారిని పిలిపించి ఒకే చోట కూర్చుని పింఛన్లు లబ్ధిదారులకు అందించారు. ఆయా ప్రాంత టీడీపీ నాయకుల చేతులమీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులు పింఛన్ కోసం ఆ ప్రాంతానికి వెళ్లి తీసుకోవడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. పింఛన్ల పంపిణీ పేరుతో ఆయా గ్రామాల్లోని పార్టీ కార్యాలయాల వద్ద పింఛన్ లబ్ధిదారులను పిలిచి సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేయించి హడావిడి చేశారు. ఇంటింటికీ ఇస్తామన్న పింఛన్ పంపిణీ తీరు మారడంతో లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు.



మద్దూరులో పింఛన్ లబ్ధిదారులను ఒకే చోటకు పిలిచి పింఛన్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

అతిసార నివారణకు పటిష్ట చర్యలు

పెనమలూరు: గ్రామాల్లో అతిసార రాకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్టాప్ డయేరియా మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆశా వర్కర్లు, విలేజ్, వార్డు హెల్త్ సెక్రెటరీలు, సీహెచ్‌ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సర్వే చేస్తారన్నారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో డయేరియా కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులకు డయేరియా నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఇస్తామని తెలిపారు. నీరు క్లోరినేషన్ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

కంకిపాడు: అతిసార వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చేపట్టిన స్టాప్ డయేరియాపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రాంగణంలో స్టాప్ డయేరియాపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమం సమర్థంగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసూజ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించాలని, ఆహార విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా అతిసార వ్యాధిపై రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, వైద్యాధికారి డాక్టర్ అంజు, ఎంపీహెచ్ ఈఓ శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: అతిసార వ్యాధి నుంచి తమ పిల్లలను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి సూచించారు. ఆత్కూరులో అతిసార నుంచి తమ పిల్లలను రక్షించండి అంటూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు ఒక రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు పలుచగా విరోచనం అయితే దానిని అతిసారగా గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించాలని అన్నారు. పిల్లలకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. వైద్యులు సూచించిన విధంగా ఓఆర్ఎస్ ద్రావణాన్ని పిల్లలకు పట్టించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ సాంబశివరాజు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, సీహెచ్‌ఓ రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పలూరులో స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ



పెనమలూరులో స్టాప్ డయేరియా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్



ఆత్కూరులో గోడపత్రికలతో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మనోహర్‌రెడ్డి

చిట్టీల పేరుతో మోసం చేసిన మహిళపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: చీట్టీల వ్యాపారం పేరుతో అమాయకుల నుంచి రూ. లక్షల్లో సొమ్ము వసూలు చేసి పరారు అయిన ఓ మహిళపై హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌కు చెందిన షేక్ నర్గీస్ అనే మహిళ ఆ కాలనీ వాసులను నమ్మించి రూ. లక్షల్లో చీటీలు, అధిక వడ్డీ ఆశ చూపించి డిపాజిట్లు కట్టించుకుని ఊడాయించిన విషయం విదితమే. దీంతో బాధితులంతా లబోదిబోమంటూ హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ దీనిపై ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లా జైలులో నూతన చట్టాలపై అవగాహన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పార్లమెంట్ ఆమోదించిన నూతన చట్టాలపై సోమవారం జిల్లా కారాగారంలోని ఖైదీలకు అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో న్యాయవాదులు బి. సాంబశివరావు, ఎస్.కోటేశ్వరరావు, పద్మజ ఖైదీలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలపై నియమావళి, అమలు, ఖైదీలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సంస్కరణలపై, సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కారాగార పర్యవేక్షణాధికారి హంసపాల్, జైలర్ ఎన్.గణేష్, జైలర్ వేణు, డిప్యూటీ జైలర్ బి.గోపయ్యనాయక్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

6న మంగళంపల్లి జయంతి వేడుకలు

విజయవాడకల్చరల్: సంగీత విద్వాంసుడు పద్మభూషణ్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ జయంతి వేడుకలను తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద విజయవాడ బ్రాహ్మణ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త జింకా చక్రధార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు పాల్గొంటారని వారిని ఆత్మీయంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు.

వైద్యులు ప్రాణదాతలు

ఘనంగా వైద్యుల దినోత్సవం

ఉయ్యూరు: వైద్యులే ప్రాణదాతలు అని లయన్స్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలువురు ప్రముఖ వైద్యులను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కేపీఎస్ డెంటల్ వైద్యులు కైలాష్‌కుమార్, డాక్టర్ జంపాన పూర్ణిమలను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నేరెళ్ల తేజసాయి వెంకట్, ప్రతినిధులు వీణవాహి ప్రసాద్, కుటుంబరాజు, ఊర కిషోర్‌కుమార్, ఎండీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో డాక్టర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాల్లో వైద్యులను సత్కరించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా హనుమాన్ జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ బళ్లా లలితాంబ నేతృత్వంలో ప్రముఖ సీనియర్ వైద్యులు దుట్టా రామచంద్రరావు, నడిమింటి బలరామకృష్ణను బ్యాంకు సిబ్బంది సత్కరించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాపులపాడు, వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ ఎంజే మంజూష, డాక్టర్ కిరణ్మయిలను ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంత పేదలకు వీరు అందిస్తున్న వైద్య సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో బ్యాంకు ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ స్వర్ణ ఆకాష్, బీఎస్ఏ వేగిరెడ్డి బాలాజీ, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కళ్లేపల్లి నారాయణరావు, తమిరి రమేష్, సీనియర్ సభ్యులు నందూరి సత్య వెంకటేశ్వర శర్మ, చలసాని వెంకటేశ్వరరావు, అక్కినేని రాఘవేంద్రరావు, తాడి రంగారావు పాల్గొన్నారు.

గన్నవరం: లయన్స్‌క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లీ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ ఝాన్సీలక్ష్మి, డాక్టర్ వి.వెంకటేష్‌ను సత్కరించారు. సమాజంలో వైద్యులు అందిస్తున్న సేవల గురించి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దండమూడి శ్రీనివాసరావు కొనియాడారు. క్లబ్ కార్యదర్శి శ్రీరాం శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కెఎస్ఆర్‌కె.ప్రసాద్, దిలీప్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు కైలాష్, పూర్ణిమను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు



హనుమాన్‌జంక్షన్‌లో వైద్యుడు రామచంద్రరావును సత్కరిస్తున్న మేనేజర్ లలితాంబ, బ్యాంకు సిబ్బంది

రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖకు పలు అవార్డులు

గన్నవరం: రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ 2023-24 ఏడాదిలో చేసిన సేవా కార్యక్రమాలకుగాను రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-3020 నుంచి పలు అవార్డులను అందుకుంది. అత్యుత్తమ సేవలు అందించినందుకుగాను బెస్ట్ క్లబ్‌తో పాటు బెస్ట్ రోటరీ అధ్యక్షుడిగా జాస్తి విజయ భూషణ్ కుమార్, బెస్ట్ కార్యదర్శిగా నర్రా సీతారామారావుకు గోల్డ్ కేటగిరిలో అవార్డులు లభించాయి. పబ్లిక్ ఇమేజ్, కమ్యూనిటీ సర్వీసెస్, మెంబర్‌షిప్, బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ విభాగాలకుగాను ప్లాటినం మెడల్స్ దక్కినట్లు క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ సర్వీసెస్‌కుగాను సిల్వర్ అవార్డు, యూత్ సర్వీసెస్‌కు డైమండ్ అవార్డు వచ్చినట్లు చెప్పారు. రోటరీ సభ్యులందరి సమిష్టి కృషి ఫలితంగానే ఇన్ని అవార్డులు వచ్చాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలందించే లక్ష్యంతో రోటరీ క్లబ్‌ను ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు.



రోటరీ క్లబ్‌కు దక్కిన గోల్డ్, సిల్వర్, ప్లాటినం అవార్డులు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఏలూరు చిన్న వెంకన్నకు చెందిన బృందం సోమవారం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద సోమవారం సాయంత్రం కళాబృందానికి చెందిన పలువురు చిన్నారులు, మహిళలను అమ్మవారి పాటలు, కీర్తనలకు లయబద్ధంగా కోలాటాన్ని ప్రదర్శించారు. బుజ్జి... బుజ్జి... గణపయ్య..., గోగులో.. గోగుల్లో..., లేలేవయ్యా అంజనస్వామి అంటూ పలు కీర్తనలను ఆలపించారు. కీర్తనలకు తగినట్లుగా బృందంలోని సభ్యులు కోలాటం ఆడగా, భక్తులను వీక్షించారు. అనంతరం బృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సాగునీటి మోటార్ల ఏర్పాటుకు వంశీ కృషి



వల్లభనేని వంశీమోహన్

గన్నవరం: నియోజకవర్గంలో రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. పోలవరం కాలువ, డెల్టా పరిధిలోని పంట భూములకు సాగునీటిని పంపింగ్ చేసుకునేందుకుగాను 650 మోటార్లు ఏర్పాటు చేసేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ రైతులకు, ఎన్డీఏ ప్రభుత్వానికి ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా గత పదేళ్లుగా పోలవరం కుడి కాలువపై తన సొంత ఖర్చుతో 500 మోటార్లు ఏర్పాటు చేసి పట్టిసీమ నీటిని పంట పొలాలకు, చెరువులకు మళ్లించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఏలూరు కాలువపై కూడా 150 మోటార్లు ఏర్పాటు చేసి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సుమారుగా 500కు పైగా మోటార్లు, ఇతర సామాగ్రి కేవలం రైతులు ఉపయోగించుకునేందుకు నియోజకవర్గంలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. గతంలో మాదిరిగానే రైతులు, రైతు నాయకులు కమిటీలుగా ఏర్పడి యథావిధిగా సాగునీటి అవసరాల నిమిత్తం మోటార్లు వినియోగించుకోవాల్సిందిగా ఆయన మనవి చేశారు. మోటార్లు వినియోగించుకునే అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా, కేవలం రైతు ప్రయోజనాల కోసం తాను స్వచ్ఛందంగా చేస్తున్న కార్యక్రమంగా భావించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వానికి, రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా లాయర్ల ఆందోళన

గన్నవరం: కొత్తగా అమలులోకి వచ్చిన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా స్థానిక 12వ ఏఎంఎం కోర్టు ఎదుట సోమవారం న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ పిలుపు మేరకు 'బ్లాక్ డే' లో భాగంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు అనుమోలు వెంకటేశ్వరరావు, తిరివీధి వెంకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు కొత్త చట్టాలు అప్రజాస్వామికమైనవిగా చెప్పారు. ఈ కొత్త చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు శీలం సాంబశివరావు, మూల్పూరు సక్కుబాయి, జీ భాస్కరరావు, బీవీ స్వామి, కే సరస్వతి, డీ బద్రీనాథ్, కే సుబ్బారావు, మరీదు తంబీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

సామాజిక పింఛన్ల పంపిణీ

గన్నవరం: నియోజకవర్గంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. స్థానిక కొత్తపేటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి పెంచిన పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఉప సర్పంచి పాలడుగు నాని, మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీలక్ష్మి, ఎంపీడీఓ సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నున్న గ్రామంలో సచివాలయ పంచాయతీ కార్యదర్శి జిటివి.రమణ, ఇతర సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వార్డు సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, యర్కారెడ్డి వెంకటరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో కూడా పింఛన్ల పంపిణీ జరిగింది.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బందితో పాటు అంగన్వాడీ టీచర్లు, జెడ్పీ పాఠశాల సిబ్బంది సహకారం తీసుకున్నారు. పలు గ్రామాల్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో కొద్ది సేపు పంపిణీకి అంతరాయం కలిగింది.

పెనమలూరు: ఎన్టీఆర్ పింఛన్ భరోసా సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పెనమలూరు, పోరంకి ప్రాంతాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ. 4 వేలు పింఛన్ ఇస్తున్నామని తెలిపారు. సచివాలయ సిబ్బందితో పాటు పలు శాఖల సిబ్బంది పింఛన్ వేకువజామునే లబ్ధిదారులకు అందజేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయా ఆనంద్, ప్రభాకరరావు, శుభశేఖర్ పాల్గొన్నారు.

ఉంగుటూరులో 96 శాతం పంపిణీ

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా 96 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే అధికారులు, సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పింఛన్ల పంపిణీని ఎంపీడీవో పర్యవేక్షించారు.

ఉయ్యూరు: సామాజిక పింఛన్ల పంపిణీ ఉయ్యూరులో సోమవారం సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో సోమవారం వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాస చౌదరి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పింఛన్లు అందని వారు మంగళవారం పింఛన్లు తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాధిక, సంపూర్ణమ్మ, ఈఓ పద్మావతి, వ్యవసాయ శాఖ సహాయకుడు షరీఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీని నిర్వహించారు. గ్రామ పంచాయితీల పరిధిలో సచివాలయ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పంపిణీలో పాల్గొన్నారు. చిక్కవరం గ్రామంలో సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, సచివాలయ కార్యదర్శి రాజేష్ పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. చిట్టినేని జోజిబాబు, రేపూరి శివరామకృష్ణ, చిట్టినేని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీని నిర్వహించారు. మండలంలో సుమారు 70 శాతం మందికి తొలి రోజు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



పోరంకిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెదపులిపాకలో పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచి శ్రీనివాస చౌదరి